క్లుప్తంగా

చేపల వేట ప్రారంభం



సి.బెళగల్ చెరువు వద్ద చేపలను గ్రేడింగ్ చేస్తున్న మత్స్యకారులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని చెరువులో మత్స్యకారులు చేపల వేటను గురువారం నుంచి ప్రారంభించారు. మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి గ్రామాలకు చెందిన దాదాపు 300 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు సంఘంగా ఏర్పాటై చెరువలో చేపల పెంపకం చేపట్టారు. చెరువులో నీటి నిల్వలు తగ్గుతుండటంతో చేపల వేట ప్రారంభించినట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. చేపలు మంచి ధర పలుకుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. గురువారం సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ పాఠ్యాంశాలపై జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్‌ను వారు సందర్శించి, శిక్షణ తరగతులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విద్యా లక్ష్యాలను ఉపాధ్యాయులకు వివరించారు. పాఠశాలలో విద్యాబోధన విధానాలు, విద్యార్థుల సంసిద్ధత అంశాలను ఎంఈఓ ఉపాధ్యాయులకు తెలియపరిచారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించండి



కోడుమూరు హైస్కూల్‌లో భోజనాన్ని రుచి చూస్తున్న డిప్యూటీ ఈఓ హనుమంతరావు

కోడుమూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరింత రుచికరంగా మధ్యాహ్న భోజనం అందించాలని కర్నూలు డిప్యూటీ ఈఓ హనుమంతరావు వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. గురువారం కోడుమూరు హైస్కూల్‌ను డిప్యూటీ ఈఓ ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోందని, నిర్ణయించిన మెనూ ప్రకారం ప్రతి రోజు నాణ్యతగా ఆహారం వండి పెట్టాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు.

పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

అనంతరం కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కృష్ణగిరి మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు హైస్కూల్లో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణా తరగతులను డిప్యూటీ ఈఓ పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. పదో తరగతి చదివే విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై పట్టు రావడంతో పాటు, మంచి మార్కులు సాధించే విధంగా విద్యాబోధన చేయాలన్నారు. ప్రతి హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్చాలి



చెంచుకాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పాలని ఎంఈఓ-2 సుబ్రమణ్యం అన్నారు. గురువారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మధ్యలో బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు సహకరించాలన్నారు. చెంచుకాలనీలో డ్రాపౌట్స్ అధికంగా ఉండడంతో వారిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు మంచాలకట్టలో గడప గడపకు మన ప్రభుత్వం

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, మేఘనాథరెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి సమస్యలతో పాటు, ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకోనున్నారన్నారు.

నిశ్శబ్ద విప్లవం





ఎయిడ్స్ అంటే ఒకప్పుడు చచ్చేంత భయం. సదరు రోగి ఫలానా చోట ఉన్నాడంటే అటువైపు వెళ్లేందుకు సైతం సాహసించేవారు కాదు. ఇప్పుడు సాధారణ ప్రజల్లా వారు కలిసిమెలసి తిరుగుతున్నారు. దీనికి కారణం ఈ వ్యాధి పై ప్రజలకు అవగాహన రావడమే. ఎయిడ్స్ అంటుకునే వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని తెలుసుకుని దాని భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకు ప్రభుత్వం, జిల్లా అధికారులు సైతం అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ బాధితుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- జిల్లాలో తగ్గుతున్న ఎయిడ్స్ ప్రభావం
- ఐదేళ్ల క్రితంతో పోలిస్తే తగ్గుదల
- ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఐసీటీసీ, పీపీసీటీసీతో పాటు ఆదోని ఏరియా ఆసుపత్రి, ఆదోని ఎంసీహెచ్ ఆసుపత్రి, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరులలో ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్స్(ఐసీటీసీ) కేంద్రాలున్నాయి. మొత్తంగా 35 పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌సీలు, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ సెంటర్లు ఆరు, కమ్యూనిటీ బేస్డ్ టెస్టింగ్ సెంటర్లు ఆరు, సివిల్ డిస్పెన్సరీ అండ్ రీజినల్ ఐ హాస్పిటల్స్ రెండు, మొత్తం ఐసీటీసీలు 87 ఉన్నాయి. వీటితో పాటు యాంటి రిట్రీవల్ థెరపీ సెంటర్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు.



ఐసీటీసీ కేంద్రంలో హెచ్‌ఐవీ బాధితునికి కౌన్సిలింగ్ ఇస్తున్న సిబ్బంది

సురక్ష క్లినిక్స్ మూడున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 7,168 మంది హెచ్‌ఐవీతో బాధితులున్నారు.

అవగాహనతో తగ్గుతున్న హెచ్‌ఐవీ బాధితులు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. 2018లో సాధారణ ప్రజలు 78,484 మందికి పరీక్షలు చేయగా 1,249 మందికి హెచ్‌ఐవీ నిర్ధారణ కాగా ప్రస్తుత యేడాది అక్టోబర్ వరకు 46,752 మందికి పరీక్షలు చేయగా 295 మందికి హెచ్‌ఐవీ నిర్ధారణ అయ్యింది. అలాగే గర్భిణుల్లో 2018లో 62,498 మందికి పరీక్షలు చేయగా 67 మందికి పాజిటివ్ రాగా, ఈ యేడాది అక్టోబర్ వరకు 48,071 మందికి పరీక్షలు చేయగా కేవలం 11 మందికి మాత్రమే హెచ్‌ఐవీ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

వీరి ద్వారా హెచ్‌ఐవీ విస్తరణ

ఫిమేల్ సెక్స్‌వర్కర్స్ 6,757 మంది, ఎంఎస్‌ఎంలు(స్వలింగసంపర్కులు) 2,302లు, లింగమార్పిడి చేయించుకున్న వారు 292ల ద్వారా హెచ్‌ఐవీ వ్యాపిస్తుందని భావించి వారికి అవసరమైన వైద్యసేవలను ఎన్‌జీఓలు అందిస్తున్నాయి. వీరితో పాటు లింక్ వర్కర్ స్కీమ్ ప్రోగ్రామ్ ద్వారా వలసలు వచ్చిన వారు, ట్రక్కు డ్రైవర్లు ఇతరుల ద్వారా హెచ్‌ఐవీ వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి అవార్డులు

ఉత్తమ సేవలు అందించిన విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఏటా డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అందజేసే రాష్ట్రస్థాయి అవార్డులు జిల్లాకు మూడు లభించాయి. ఉత్తమ జిల్లా అవార్డు, ఉత్తమ ఐసీటీసీ(ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కర్నూలు), ఉత్తమ స్టేట్ రిఫరెన్స్ లేబోరేటరీ(మైక్రోబయాలజీ విభాగం, కర్నూలు మెడికల్ కాలేజీ).

అవగాహన కార్యక్రమాలు

- జానపద నృత్యకళాకారుల బృందాలచే హైరిస్క్ ప్రాంతాల్లో ఆటపాటల ద్వారా అవగాహన కార్యక్రమాలు
- కళాశాలల్లో రెడ్‌రిబ్బన్ క్లబ్‌ల ద్వారా సుఖవ్యాధులు, హెచ్‌ఐవీ, టీబీ, కౌమార దశలోని మార్పుల గురించి అవగాహన కార్యక్రమాలు
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు మరింత పోషకాహారం పంపిణీ
- డీఆర్‌డీఏ ద్వారా హెచ్‌ఐవీ బాధితులకు పెన్షన్ల పంపిణీ
- సివిల్ సప్లయ్స్ ద్వారా సెక్స్‌వర్కర్లు, స్వలింగసంపర్కులు, లింగమార్పిడి చేయించుకున్న వారికి రేషన్ పంపిణీ

నేడు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు



వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని జిల్లా పరిపాలన, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థినీ విద్యార్థుల భాగస్వామ్యంతో కలెక్టరేట్ నుంచి రాజవిహార్ వరకు భారీ ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నాం. ర్యాలీ అనంతరం కర్నూలు వైద్య కళాశాలలో సమావేశం నిర్వహించి ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేస్తాము. దాతల సహకారంతో అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు హెచ్‌ఐవీ బాధితులతో కలిసి సహపంక్తి అల్పాహార విందు, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ నియంత్రణ అధికారి, కర్నూలు

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మన్సురుద్దీన్

కోడుమూరు: కోడుమూరులో మట్కా నిర్వహిస్తున్న దాసరి కృష్ణ, షేక్ ఇబ్రహీంలను కోడుమూరు, గూడూరు ఎస్‌ఐలు శ్రీనివాసులు, పీరయ్యలు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు సీఐ మన్సురుద్దీన్ గురువారం తెలిపారు. నిందితుల వద్ద నుంచి మట్కా చీటీలతో పాటు రూ.35 వేలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. సర్కిల్ పరిధిలో ఎవరైనా వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందని సీఐ వివరించారు.

క్రీడాకారులను తీర్చిదిద్దాలి

కర్నూలు (టౌన్): ప్రభుత్వ రంగ పాఠశాలల్లో చదివే విద్యార్థులను మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రంగారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయులకు స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం – ఆంధ్రా కార్యక్రమాన్ని పీఈటీలు విజయవంతం చేయాలన్నారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనేలా చైతన్యం చేయాలన్నారు. జిల్లాలో నిర్వహించనున్న ఆడుదాం –ఆంధ్రా క్రీడలకు ప్రధానోపాధ్యాయులు, పీఈటీలను రిలీవ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, కర్నూలు కాంప్లెక్స్ ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, పాణ్యం ఇన్‌చార్జ్ పాల్ సుధాకర్ పాల్గొన్నారు.



గుడిపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ముదుమలగుర్తిలో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

గూడూరు రూరల్: పేదల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. గుడిపాడులో గురువారం నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగనన్న', 'ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని వివరించారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించినట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగనన్నను సీఎంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. నాయకులు దుబాయ్‌శీను, శేఖర్, కృష్ణారెడ్డి, ఓమంతు, తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ హనుమంతురెడ్డి, కల్లూరు అర్బన్ క్లస్టర్-2 అధ్యక్షుడు, కార్పొరేటర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 33వ వార్డులో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారం, ఆరోపణలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం వార్డులో వైఎస్సార్‌సీపీ జెండావిష్కరణ చేశారు. కార్పొరేటర్ నరసింహులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ 19వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్ రెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. అనంతరం వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. వార్డులో పార్టీ జెండావిష్కరణ చేశారు. నాయకులు గోపాల్‌రెడ్డి, లక్ష్మిపతి, శివరాం, నిర్మలమ్మ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తోందని ముదుమలగుర్తి గ్రామ సర్పంచ్ సువర్ణ అన్నారు. గురువారం మండలంలోని ముదుమలగుర్తి గ్రామ సచివాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, సీఎం జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించడంతో పాటు, 33 సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందిన లబ్ధిని వివరిస్తూ సచివాలయంలో ప్రగతి బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ సువర్ణ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్, మధు, మల్లేష్, గోకారి, సుంకన్న, బలరాం తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రభుత్వం సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ ఇళ్ల వద్దకే అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. సి.బెళగల్ మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పాల్గొని ఆ గ్రామ సచివాలయం పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో కొండాపురం గ్రామ సచివాలయం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.20,53,63,438 మొత్తాన్ని లబ్ధిదారులకు అందించినట్లు తెలిపారు. జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి మాట్లాడుతూ.. లబ్ధిపొందిన వారందరూ వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును, గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, గృహ సారథులు ఆనందం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముదుమాలలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం

సి.బెళగల్ మండల పరిధిలోని ముదుమాల గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసి రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు కల్చరల్: కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామ పంచాయతీ టీవీ9 ప్రజా నగర్‌కు చెందిన మహబూబ్‌బాషాతో పాటు మరో 50 మంది స్థానికులు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సమక్షంలో ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కుల మత, ప్రాంత, పార్టీ చూడకుండా చేస్తున్న అభివృద్ధి, కోడుమూరు ఎమ్మెల్యే నియోజవర్గానికి నాలుగేళ్లలో రూ.300 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు వారు తెలిపారు. పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

సంక్షేమ పథకాలతోనే పేదల అభివృద్ధి



ఉయ్యాలవాడలో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతోనే నిరుపేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతోందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గురువారం ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సచివాలయాల మండల కన్వినర్ లోటర్ బాషా, సర్పంచు శకుంతలమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక వడ్డెగేరి, తెలుగు పేట, ముస్లీం వీధి, గొల్లపేట, కొత్త బిల్డింగ్‌లు, ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే అధికారులు, స్థానిక నాయకులతో కలిసి కలియ తిరిగారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, గత నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూనే, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ముస్లీం వీధిలోని ఉర్దూ పాఠశాలలో తెలుగు మీడియం పిల్లలకు కూడా అవకాశం కల్పించాలని కాలనీవాసులు కోరారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కొందరు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు సరోజమ్మ, స్థానిక నాయకులు ఎల్లశేఖరరెడ్డి, బొమ్మన నాగేశ్వరరెడ్డి, బొమ్మన రామిరెడ్డి, పల్లె మోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు, మాదన్న, రవికుమార్‌రెడ్డి, శివారెడ్డి, రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమలకు చేయూత

పాణ్యం: చిన్న తరహా పరిశ్రమలు ర్పాటు చేయాలనుకునే వారికి కేంద్ర ప్రభుత్వం చేయూత అందిస్తుందని ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. గురువారం మద్దూరు, అనుపూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధామంత్రి విశ్వకర్మయోచన పథకం ద్వారా రాయితీలు అందిస్తున్నట్లు చెప్పారు. చేయూత, సంప్రదాయ, చేతివృత్తులు ఇతర పరిశ్రమలు స్థాపించాలనుకునే వారు అవకాశాన్ని సద్వినయోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం విశ్వకర్మపథకంతో వేల మంది లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని, ఆరోగ్యగ్రామంగా తీర్చిదిద్దేంకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ప్రదీప్‌రెడ్డి, నాగలక్ష్మమ్మ పాల్గొన్నారు.

గడివేముల: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. గురువారం మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వికసిత భారత్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, సీసీ శేషు, మహిళలు పాల్గొన్నారు.

కల్లూరు: కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి అన్నారు. గురువారం చిన్నటేకూరు, ఉలిందకొండ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో గ్రామాలపై ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్, ఉజ్వల్ యోజన వంటి పథకాలు ప్రజల అభ్యున్నతికి ఉపయోగపడతాయన్నారు. ఈఓఆర్డీ రవికిషోర్, సర్పంచ్‌లు సుంకులమ్మ, లక్ష్మన్న, పంచాయతీ కార్యదర్శులు, మెడికల్ ఆఫీసర్లు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఓటరు నమోదుపై అవగాహన కల్పించండి

గూడూరు రూరల్: 18 ఏళ్లు నిండిన యువతకు ఓటరు నమోదుపై బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులు అవగాహన కల్పించి, దరఖాస్తు చేయించాలని ఆర్‌డీఓ హరిప్రసాద్ సూచించారు. గూడూరులోని వైకేపీ కార్యాలయంలో గురువారం ఓటరు నమోదుపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 2, 3 తేదీలలో ఓటరు నమోదుపై పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు ఓటరు నమోదుపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ఓటరు జాబితాలో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలని, తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంకటరమణ, డీటీ ప్రవీణ్, ఎల్.వెంకటేశ్వర్లు, దండు సుందరరాజు, రామాంజనేయులు, గజేంద్రగోపాల్, బుడంగళి, విజయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు పక్కాగా చేపట్టాలి

సి.బెళగల్: గ్రామాలలో చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని బీఎల్వోలు పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శేషఫణి ఆదేశించారు. ఆయన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, బీఎల్వోలతో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు, సవరణ, మార్పులు చేర్పులపై సూచనలు చేశారు. ఏఎస్‌ఓ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

జాబితాలో పేర్లను సరిచూసుకోవాలి

కోడుమూరు రూరల్: ఓటర్లు ఆయా పోలింగ్ బూత్‌లను సందర్శించి ఓటరు జాబితాలో తమ పేర్లు, ఫొటోలను సరిచూసుకోవాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ సూచించారు. గురువారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితా సవరణపై బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 2, 3 తేదీల్లో ఆయా పోలింగ్ బూతుల్లో ఓటరు జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని, ఓటర్లు తమ పేర్లను సరిచూసుకోవడంతో పాటు జాబితాపై అభ్యంతరాలున్నా, డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లు ఉన్నా ఫారం-6, 7, 8ల ద్వారా బీఎల్వోలకు ఫిర్యాదు చేయాలన్నారు. తహసీల్దార్ జయన్న, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి, ఏఎస్‌ఓ రఘువీర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డీఓ హరిప్రసాద్

కాల్వబుగ్గలో ముగిసిన వేలం పాట

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాల్వబుగ్గలో గురువారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలు ప్రశాంతంగా ముగిశాయి. దేవదాయ ధర్మదాయ శాఖ నిబంధనల మేరకు ఏడాది కాలం పాటు పలు రకాల వ్యాపారాల నిమిత్తం ఆలయ అధికారులు వేలం పాటలు నిర్వహించారు. ఇందులో టీటీడీ కల్యాణ మండపం, సుంకిరెడ్డి కల్యాణ మండపాలలో సప్లయ్ సామానులు సమకూర్చుకొనుటకు రూ.44,500కు వేలం దక్కించుకోగా, టెంకాయలు విక్రయించుకునేందుకు రూ.35,000కు దక్కించుకున్నారు. వాహనాల పార్కింగ్, ఐస్‌క్రీమ్ విక్రయించుకునేందుకు, శుభకార్యాలలో తాత్కాలిక కల్యాణ మండపాలు నిర్మించుకునేందుకు, చెప్పుల స్టాండ్, కొబ్బరి చిప్పలు ప్రోగు, ఆలయ ప్రాంగణంలోని 3 దుకాణాలు కలిపి మొత్తం రూ.12,98,400 లకు వేలం వేసినట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. గత ఏడాది కంటే రూ.30,100 లు అదనంగా ఆదాయం లభించిందన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం - ఆంధ్ర' క్రీడల రిజిస్ట్రేషన్ ప్రారంభం

గడివేముల: పదిహేనేళ్లు నిండిన యువత ఆడుదాం – ఆంధ్ర క్రీడల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించే క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో పాల్గొనే వారు 1902 ఫోన్ ద్వారా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకండి

కర్నూలు(సెంట్రల్): ఆర్‌టీసీలో అప్రెంటిషిప్ కోసం దరఖాస్తుచేసున్న ఐటీఐ అభ్యర్థులు ఆర్టీసీ జోనల్ కాలేజీలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రూ.118 ఫీజు చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు హాజరు కావాలని సూచించారు.